

బోనులో చిక్కిన చిరుత 6

అన్నింటికీ.. మౌనమే..!

- సిద్దరామయ్యను చుట్టేసిన సమస్యలు
- అయినా నోరు మెదపని సీఎం
- వెంటాడుతున్న ఆరు కీలక కారణాలు
- వరుస దెబ్బలతో అనుచరుల్లో ఆందోళన



బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రెండో విడత ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న సిద్దరామయ్య రానురాను కొన్ని విషయాలలో మౌనం పాటించడం వెనుక పలు కారణాలు ఆయనను వెన్నంటి వేధిస్తున్నట్లు తెలుస్తోంది. సిద్దరామయ్య రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి పోరాట ధోరణితోనే ఎదిగారు. జేడీఎస్ పార్టీలో కొనసాగుతున్నా తనదైన శైలిలో మైసూరు ప్రాంతానికి తిరుగులేని నేతగా రాణించారు. పార్టీలో విబేధాలతో దూరమై ఆయన ఆలోచనలకు, లౌకిక విధానాలకు అనుకూలంగా ఉందని కాంగ్రెస్‌లో చేరారు. ఆయన హస్తం వైపు వచ్చేందుకు తానే కారణమంటూ పలువురు పార్టీ ప్రముఖులు చెప్పుకొన్నా ఆయనవెంట వారెవ్వరూ లేరనేది తెలిసిందే. ఇలా కాంగ్రెస్ పార్టీలో అడుగు పెట్టిన సిద్దరామయ్య అల్పసంఖ్యాత (మైనారిటీ), హిందుళిత (బీసీ వర్గాలు), దళితులను సమైక్యం చేసుకునే దిశగా 'అహింద'కు శ్రీకారం చుట్టి అదే కోణంలోనే ముందుకెళ్లారు. అనతికాలంలోనే కాంగ్రెస్‌లో అగ్రనాయకుడయ్యారు. బళ్ళారిలో బీజేపీ పాలనలో మంత్రిగా ఉంటూ కోట్లాది రూపాయల గనుల తవ్వకాలలో అక్రమాలకు పాల్పడ్డారని గాలి జనార్ధనరెడ్డికి వ్యతిరేకంగా బెంగళూరు నుంచి బళ్ళారికి పాదయాత్ర చేశారు. ఇది సిద్దరామయ్యను పార్టీలో నెంబరువన్ స్థానానికి తీసుకెళ్లింది. 2013శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ రావడంతో సిద్దరామయ్యను అధిష్ఠానం ముఖ్యమంత్రిని చేసింది. ఐదేళ్ల ఎటువంటి ఆటంకం లేకుండా పాలన సాగించారు. అయితే తరచూ ఓ వివాదం కొనసాగింది. మూల కాంగ్రెస్, వలస కాంగ్రెస్ అనేది కొనసాగినా... కేవలం ఏడాదిలోనే కేంద్రంలో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో కర్ణాటక రాజకీయాల్లో ఏమాత్రం కదిలించినా పెనుప్రమాదం ఉంటుందని అధిష్ఠానం వెనుకడుగు వేసింది. అయితే సిద్దరామయ్య ఏ విషయంలోనైనా ఖడక్ (మొండి)గా ఉంటారని, నిర్ణయాలు అదే విధంగా తీసుకుంటారనే పేరుంది. ఇటు పాలనలో అటు పార్టీ పరమైన నిర్ణయాలలో 2013 నుంచి 2018 దాకా ముక్కుసూటిగానే వ్యవహరించారు. పైగా దళిత, బీసీ, మైనారిటీ వర్గాలకు అండగా ఉండే నాయకుడిగా పేరొందారు. ఇలా ఐదేళ్లపాటు తిరుగులేని ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2023లో శాసనసభ ఎన్నికలలో స్పష్టమైన మెజారిటీ రాగా ముఖ్యమంత్రిని ఎంపిక చేసేందుకు ఐదారు రోజులు అధిష్ఠానం మల్లగుల్లాలు పడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు ఆయనను సముదాయించి ఎట్టకేలకు సిద్దరామయ్యను ముఖ్యమంత్రిని చేశారు. కానీ రెండేళ్ల పాలనలో ముఖ్యమంత్రిలో భారీ మార్పులు వచ్చాయి. ఒకప్పటి ఖడక్ అనే నేతగా కాకుండా సాఫ్ట్ అయ్యారు. అందుకు ఆయన చుట్టూ పలు కారణాలు వేధిస్తున్నాయి.

ఎక్సైజ్ శాఖలో..

సిద్దరామయ్య రెండో విడత పాలనలో ఎక్సైజ్‌శాఖలో కుంభకోణం కూడా చెడ్డపేరు తెచ్చింది. ఎక్సైజ్‌శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపురకు రూ.13 కోట్ల రూపాయలు ఇచ్చామని స్టేట్ వైన్‌మర్చంట్స్ అసోసియేషన్ నేరుగా ఆరోపించింది. శాఖాధికారులనుంచి నెలసరి మామూళ్లు ఉన్నాయని ఆరోపిస్తూ సీఎం, గవర్నర్‌లకు ఫిర్యాదు చేశారు.

అప్పుడు మంత్రి రాజణ్ణ తొలగింపు

ఓటుచౌర్యంపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారు. ఢిల్లీలో నిరసన, పార్లమెంటులో ప్రస్తావన, బెంగళూరు సభలో ఓటుచౌర్యం వివరాలు వెల్లడించారు. ఇటీవల బిహార్‌లో ప్రాంతాలవారీగా నిరసనలు కొనసాగిస్తున్నారు. బెంగళూరు మహదేవపుర నియోజకవర్గంలో ఓటు చౌర్యం జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించిన మరుసటి రోజే అప్పట్లో రాష్ట్రంలో మనప్రభుత్వమే ఉందని మంత్రి రాజణ్ణ ప్రస్తావించడం రాహుల్‌గాంధీని వ్యతిరేకించినట్లయ్యింది. దీంతో ఉన్నఫళంగా మంత్రి పదవినుంచి ఉద్వాసన పలికించారు. తాజాగా 1991లో కొప్పళ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి మోసం చేసి గెలుపొందారని రెండురోజులక్రితం సిద్దరామయ్య ప్రస్తావించారు. ఇది రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి వ్యతిరేకమైనట్లు అయింది.

పవర్ సెంటర్, హిందూత్వ వివాదం

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా సమైక్యమని చెప్పే అవకాశమే లేదు. రెండు పవర్‌సెంటర్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఎవరికి అవకాశం వచ్చిన మరొకరు వాడుకోవాలని ప్రయత్నిస్తున్న సంగతి విదితమే. మరోవైపు గ్యారెంటీలు పెను భారం అవుతున్నాయని సొంతపార్టీ ఎమ్మెల్యేలు బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కర్ణాటక తర్వాత అధికారంలోకి వచ్చిన తెలంగాణలోనూ గ్యారెంటీ పథకాలు కొనసాగుతున్నాయి. గ్యారెంటీలతో ఖజానా ఖాళీ అయ్యిందని అక్కడి సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.56వేల కోట్ల రూపాయలు గ్యారెంటీల రూపంలో భారం పడుతున్నా అటువంటి వెనుకబాటు లేదని సర్దుబాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. అయినా రాష్ట్రంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయనేది జగమెరిగిన సత్యంగా ఉంది. ఇటీవల సీఎం సిద్దరామయ్య తీసుకుంటున్న నిర్ణయాల వెనుక ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. ధర్మస్థలలో మృతదేహాలు పాతిపెట్టానని ఓ వ్యక్తి ఫిర్యాదుకు విచారణ జరపలేమని బహిరంగ ప్రకటన చేసిన ముఖ్యమంత్రి కేవలం ఒక్కరోజులోనే సిట్ ఏర్పాటు చేయడం ఆయన మౌనం, మృదుధోరణి రుజువు చేస్తోంది. ధర్మస్థల వివాదం వ్యూహాత్మకంగా ఓ బృందం చేసిన కుట్ర అనేది దాదాపు తేలిపోయింది. అయితే వెనుక ఉన్న సూత్రధారులు ఎవరనేది తేలుస్తారా..? అని అనుమానంగా ఉంది. మరోవైపు మైసూరు దసరా ఉత్సవాలను బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్ ద్వారా ప్రారంభించాలనే ముఖ్యమంత్రి నిర్ణయం వివాదాలకు కేంద్రంగా మారుతోంది.

ముడా అవినీతి



మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)కు సంబంధించిన ఇంటి స్థలాల కేటాయింపులో అవినీతి అంశం తారస్థాయిలో చర్చకు కారణమైంది. స్వయంగా సీఎం సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట ముడా 14 ఇంటి స్థలాలు మంజూరు చేసింది. భార్య, బావమరిది ఈ వివాదంలో ఇరుక్కున్నారు. కోర్టు కేసులు, సిట్ దర్యాప్తు జరిగింది. ఈ వివాదంతో ముఖ్యమంత్రికి కొంత చెడ్డపేరు వచ్చింది.

వాల్మీకి కార్పొరేషన్‌లో..



వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్లు అవినీతి చోటు చేసుకున్న పరిణామం పలు రాజకీయ ఎదురుదెబ్బలు తగిలాయి. సీఎం సిద్దరామయ్య కేబినెట్‌లో మంత్రి నాగేంద్ర అవినీతితో రాజీనామా చేయాల్సి వచ్చింది. బెంగళూరులోని యూనియన్ బ్యాంకులో ఉన్న గ్రాంటు మొత్తం మరోశాఖకు బదిలీ చేసి అక్కడనుంచి హైదరాబాద్ సహకారబ్యాంకులకు అక్రమంగా మార్పు చేసి డ్రా చేశారు. గత లోక్‌సభ ఎన్నికల ఖర్చులకు ఉపయోగించారని నిర్ధారణ అయ్యింది. బ్యాంకు సూచనలతో సీబీఐ దర్యాప్తు ప్రారంభించి చివరకు ఈడీకి అప్పగించారు. ఇందులో రూ.88 కోట్లు అవినీతి జరిగినట్లు స్వయంగా సీఎం సిద్దరామయ్య శాసనసభలో అంగీకరించారు. ఇదే విషయమై లోక్‌సభ సమావేశాలలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా కర్ణాటక ముఖ్యమంత్రి వాల్మీకి కార్పొరేషన్‌లో రూ.88 కోట్ల అవినీతి జరిగిందని అంగీకరించారనే విషయాన్ని ప్రస్తావించారు. ఇది రాహుల్‌గాంధీకి, ఢిల్లీ కాంగ్రెస్ నేతలకు అవమానం జరిగినట్లయ్యింది.

హెచ్చరికతో తగ్గిన జోరు..!

సిద్దరామయ్య పాలనలో జోక్యం చేసుకునేందుకు అధిష్ఠానం తొలి విడతలో వెనుకడుగు వేసింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా నేరుగా బెంగళూరులో మకాం వేసి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ స్థాయి నాయకులను రప్పించుకుని చర్చించడం ఇక్కడి నాయకుల వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. ఇలా ప్రతి విషయంలోనూ సీఎం ఇటీవల మృదుధోరణికి అధిష్ఠానం హెచ్చరికలు కూడా కారణమవుతున్నాయి. ఇప్పటికే పలు విషయాల్లో అధిష్ఠానం సిద్దరామయ్య స్పీడ్‌కు బ్రేకులు వేసింది. ఆయన నిర్ణయాలను సైతం అమలు కాకుండ అడ్డుకోవడంతో విధి లేని పరిస్థితుల్లో మౌనం వహించినట్లు తెలుస్తోంది.



భగీరథ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం

ఎస్టీ జాబితాలోకి ఉప్పర

- కేంద్రానికి సిఫారసు చేస్తాం: సీఎం

బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉప్పర కులాన్ని ఎస్టీ జాబితాలోకి చేర్చేలా కేంద్రానికి సిఫారసు చేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఆదివారం నంజన్‌గూడు శ్రీకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో భగీరథ జయంతి ఉత్సవంలో పాల్గొన్నారు. ఉప్పర సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. ఉప్పర సమాజానికి చెందినవారు కుల శాస్త్రీయ అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారన్నారు. మంత్రివర్గంలో చర్చించి ఆమోదించాక కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. ఉప్పర కులస్తులు విద్య, ఆర్థిక, సామాజికంగా వెనుకబడినవారన్నారు. చిత్రదుర్గ భగీరథ సంస్థాన మఠాధిపతి పురుషోత్తమానందపురి స్వామీజీ మాట్లాడుతూ చామరాజనగర జిల్లాలో సముదాయానికి చెందినవారు ఎక్కువమంది ఉన్నారన్నారు. శాఖామఠం, విద్యాసంస్థ ప్రారంభించేందుకు 5 ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. 60 అడుగుల భగీరథ ఏకశిల విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

వారానికి రూ.24 కోట్లు

- ట్రాఫిక్ చలానాలపై 50 శాతం రాయితీ
- బకాయిల వసూళ్లకు రవాణాశాఖ నిర్ణయం
- వాహనదారుల నుంచి విశేష స్పందన



బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి విధించిన జరిమానా చలానాలపై 50శాతం రాయితీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ప్రకటించిన వారం రోజుల్లో రూ.24 కోట్లు వసూలైనట్లు రవాణా శాఖ అధికారులు ప్రకటించారు. శనివారం నాటికి 8.52లక్షల కేసులకు సంబంధించి ఈ మొత్తం వసూలైనట్టు బెంగళూరు ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రకటించారు. ఆగస్టు 23నుంచి రాయితీ జరిమానా అమలులోకి వచ్చిందన్నారు. సెప్టెంబరు 12వరకు అవకాశం ఉంటుందన్నారు. 2023 ఫిబ్రవరి 11లోగా నమోదైన కేసులకు మాత్రమే ఈ అవకాశం అన్వయిస్తుందన్నారు. వాహనదారులు సైతం రాయితీతోనైనా తమ పెండింగ్ బకాయిలు చెల్లించి విముక్తి కావాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లోనే చెల్లించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



చిక్కబళ్ళాపుర నుంచి బయల్దేరుతున్న బృందం

చలో ధర్మస్థల

- ధర్మ పరిరక్షణకు కదిలిన హిందువులు

చిక్కబళ్ళాపుర/శిడ్లఘట్ట, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పిలుపుమేరకు ధర్మస్థల చలో చేపట్టినట్టు బీజేపీ చిక్కబళ్ళాపుర జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. ఆదివారం బస్సులలో ధర్మస్థలకు బయల్దేరే ముందు స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పరోక్షంగా హిందువులను టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. కొందరు పనిగట్టుకుని పుణ్యక్షేత్ర పవిత్రతను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకునేందుకు బీజేపీ ధర్మరక్షణ యాత్ర ర్యాలీ నిర్వహిస్తోందన్నారు. జిల్లా నుంచి 40కుపైగా బస్సులలో కార్యకర్తలు పాల్గొంటున్నారన్నారు. బీజేపీ నాయకులు వేణుగోపాల్, మురళీధర్, అశోక్, మధుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

హిందువులు ఏకం కావాలి

ధర్మరక్షణకోసం హిందువులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శిడ్లఘట్ట రూరల్ బీజేపీ అధ్యక్షుడు సీకల్ ఆనంద్‌గౌడ అన్నారు.. ధర్మస్థకుఉ ఆదివారం సుమారు 15 బస్సుల్లో వందలాదిమంది బయల్దేరారు. ద్విముఖ గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆనంద్‌గౌడ మీడియాతో మాట్లాడుతూ ఇటీవలికాలంలో ధర్మంపై అన్యాయం, దుష్ప్రచారం సాగుతోందని ఇందుకు అడ్డుకట్ట వేసేలా పార్టీలకు అతీతంగా అందరూ మద్దతుగా నిలిచి హిందూధర్మాన్ని కాపాడాలన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేశ్, ప్రకాశ్, ప్రతాప్, రామకృష్ణప్ప, కిట్టణ్ణ, రాజు, మంజుళ, లక్ష్మి, శారదమ్మ, బైక్ బాబు, సోమణ్ణ పాల్గొన్నారు.



శిడ్లఘట్ట నుంచి ధర్మస్థలకు బయల్దేరుతున్న బస్సు

విష్ణు సమాధి స్థలం

అటవీశాఖదే

- స్వాధీనం చేసుకుంటాం
- మంత్రి ఈశ్వర్‌ఖండ్రె



అభిమాన్ స్టూడియో విష్ణుసమాధి (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): సీనియర్ నటుడు, సాహససింహ డాక్టర్ విష్ణువర్ధన్ సమాధి ఉన్న అభిమాన్‌స్టూడియో పూర్తిగా అటవీశాఖదని స్వాధీనం చేసుకుంటామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె స్పష్టం చేశారు. సమాధికి సంబంధించి జరుగుతున్న వివాదం మరో మలుపు తిరిగింది. అభిమాన్‌స్టూడియోలో విష్ణువర్ధన్ సమాధి ఉంది. అక్కడ ఏటా పూజలు చేసేవారు. అయితే ఇటీవల కొంతకాలంగా సదరుస్థలం మాకు చెందినదని నటుడు బాలణ్ణ కుమారులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఆరేడేళ్లుగా విష్ణువర్ధన్ కుటుంబ సభ్యులు, అభిమానులు అటువైపు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. నెలరోజులక్రితం విష్ణువర్ధన్ స్మారకాన్ని పూర్తిగా నేలమట్టం చేసినవారు సదరు స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ స్థలంపై తీవ్ర వివాదం సాగుతుండగా అధికారులు పరిశీలించి సదరు స్థలం అటవీశాఖకు చెందినదిగా తేల్చారు. 1980లో అటవీశాఖ చట్టానికి అనుగుణంగా 20 ఎకరాల భూమిని స్టూడియో నిర్మించేందుకు పీఎన్ బాలకృష్ణకు ఎకరాకు రూ.300 చొప్పున 6వేల రూపాయలతో కేటాయించారు. 22ఏళ్లక్రితం అందులో 10ఎకరాల భూమిని విక్రయించారు. మిగిలిన పదెకరాల భూమిని విక్రయించేందుకు సిద్ధమవుతుండగా అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలిపారు. కాగా ఆ భూమిలో చెట్లు పెంచుతామని మంత్రి ఖండ్రె తెలిపారు.



బై..బై.. గణేశా

- ఉత్సాహంగా వినాయక నిమజ్జనం

బెంగళూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాలలో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. వినాయక చవితి రోజున కొలువుదీర్చినప్పటి నుంచి ఐదురోజులు పూర్తి కావడంతో వేర్వేరుసంఘాల వారు విశేషపూజలు చేసి గణనాథుడిని పురవీధులలో ఊరేగించారు. అనంతరం హలసూరు చెరువులో నిమజ్జనం చేశారు. కాగా సాంకి చెరువు, యడియూరు చెరువు, కెంపాబుధి తదితర చెరువులలో కూడా నిమజ్జనానికి చేశారు. పలు కళాబృందాలు, కళాకారులు పాల్గొని సందడి చేశారు. నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బీబీఎంపీ సిబ్బంది, పోలీసులు పర్యవేక్షించారు.



హలసూరు చెరువుకు తరలుతున్న గణనాథులు







పలు రూపాల్లో గణనాథుడు



నగరంలో ప్రధాన రహదారుల్లో ఊరేగింపులో భక్తులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శ్రీల ప్రభుపాద (జయంతి)



శ్రీల ప్రభుపాదగా గుర్తింపు పొందిన ఆధ్యాత్మికవేత్త, ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులైన అభయ చరణారవింద భక్తివేదాంత స్వామి 1896 సెప్టెంబరు 1న కోల్కత్తాలో జన్మించారు. చైతన్య మహాప్రభు బాటలో కొన సాగుతూ హరేకృష్ణ నామాన్ని పఠించడం ద్వారా ప్రజలలో భక్తిభావం పెంపొందించేలా కృషి చేశారు. శ్రీకృష్ణ పరమాత్ముడి బోధనలు ప్రచారం చేశారు. దేశంలోనేకాక అమెరికా, యూరప్ తదితర దేశాలలో సైతం ఆయనకు అనుచరులు ఉండడం విశేషం. 1977 నవంబరు 14న కన్నుమూశారు.

సోనమ్ వాంగ్‌చుక్ (పుట్టినరోజు)



ప్రముఖ ఇంజనీర్ సోనమ్ వాంగ్‌చుక్ 1966 సెప్టెంబరు 1న జన్మించారు. ఆవిష్కర్తగా, విద్యా వేత్తగా గుర్తింపు పొందారు. 'స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లద్దాక్'కు సంస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు. సౌరశక్తితో వంట, విద్యుత్ ఇతరత్రా అవసరాలకు ఉపయోగించారు. కృత్రిమ గ్లేసియర్స్ ద్వారా పలు ప్రయోగాలు చేశారు. 2018లో రామన్ మెగసెసె అవార్డు, గవర్నర్ మెడల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిఫార్మ్ ఇన్ జమ్ము-కశ్మీర్ తదితర గౌరవాలు పొందారు.

యామిని రెడ్డి (పుట్టినరోజు)



కూచిపూడి నృత్యంద్వారా పేరొందిన శాస్త్రీయ నృత్యకారిణి యామినిరెడ్డి 1982 సెప్టెంబరు 1న జన్మించారు. 'పద్మభూషణ్' పురస్కార గ్రహీతలైన డాక్టర్ రాజారెడ్డి, రాధారెడ్డిల కుమార్తె. తల్లిదండ్రుల వద్దనే నాట్యం నేర్చుకుని రాణించారు. హైదరాబాద్‌లో నాట్య తరంగిణి డ్యాన్స్‌స్కూల్‌లో నృత్యపాఠాలు బోధిస్తున్నారు. యువరత్న అవార్డు, సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్, దేవదాసి నేషనల్ అవార్డు, ఎఫ్ఐసిసిఐ యంగ్ అచీవర్స్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

మన్‌జిత్‌సింగ్ (పుట్టినరోజు)



ఇండియన్ అథ్లెట్‌లలో ఒకరైన మన్‌జిత్‌సింగ్ 1989 సెప్టెంబరు 1న హరియాణ రాష్ట్రం ఉజానాలో జన్మించారు. మిడిల్ డిస్టన్స్ రన్నర్ 800 మీటర్లు, 1500 మీటర్ల విభాగాలలో సత్తా చాటుకున్నారు. జకార్తాలో 2018 ఏసియన్ గేమ్స్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి 800 మీటర్ల విభాగంలో బంగారుపతకం సాధించారు.



బయోమెట్రిక్ హాజరు వేస్తున్న టీటీఈ

ప్రయోగాత్మకంగా టీటీఈలకు బయోమెట్రిక్

గుంతకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దక్షిణ మ ధ్య రైల్వేలో పైలెట్ ప్రోగ్రా మ్‌గా చేపట్టిన టికెట్ చె కింగ్ ఎగ్జామినర్ల (టీటీఈ) బయోమెట్రిక్ సైనిన్, సైనాఫ్ సిస్టంను గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో ప్రారంభించారు. గతంలో టీటీఈల హాజరు, విధుల నుంచి వైదొలగే కార్యక్రమం మాన్యువల్ ప్రక్రియగా ఉండేది. టికెట్ చెకింగ్ విధానంలో ఖచ్చితత్వం కోసం రైల్వే బోర్డు ద.మ. రైల్వే జోన్‌లో ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ సైన్ ఇన్, సైనాఫ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఆదివారం టీటీఈలు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర, ఫేస్ ఐడెంటిటీ, ఐరిస్, వాయిస్ గుర్తింపుతో హాజరు నమోదు, విధుల నుంచి వైదొలగే ప్రక్రియకు నాంది పలికారు.

ఒంటరి ప్రయాణికురాలి భద్రతపై దృష్టి

రైళ్లల్లో ఒంటరిగా వెళ్లే ప్రయాణికురాళ్లపై టీటీఈల ద్వారా ప్రత్యేక దృష్టిని నిలిపి వారికి భద్రత కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. గుంతకల్లు మీదుగా వెళ్లిన కోయంబత్తూరు-ముంబై (నం. 11014) ఎక్స్‌ప్రెస్‌లో టీటీఈల ద్వారా ఒంటరి ప్రయాణికురాళ్లను పలకరించి, వారి వివరాలను నమోదుచేసి, వారు గమ్యం చేరేంత వరకూ అందుబాటులో ఉంటామంటూ భరోసా కల్పించే కార్యక్రమాన్ని ఆరంభించారు.

విద్య.. సమాజ హితం కావాలి

▸▸ కైలాశ్ సత్యార్థి పిలుపు



స్నాతకోత్సవంలో కైలాశ్ సత్యార్థికి సన్మానం

బెంగళూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య స్వార్థానికి కాకుండా సమాజ హితంకోసం కావాలని అప్పుడే సార్థకత సాధ్యమవుతుందని నోబెల్ శాంతి పురస్కార గ్రహీత కైలాశ్ సత్యార్థి అభిప్రాయపడ్డారు. శనివారం ఆర్‌వీ యూనివర్సిటీలో స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. 259మందికి పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ సమాజ నిర్మాణం కావాలంటే ఎవరో ఎక్కడనుంచి సాధ్యం చేయలేరన్నారు. పోటీతత్వ ప్రపంచంలో పోరాడినవారే చరిత్ర లిఖిస్తారన్నారు. సమాజంలో సానుభూతి ఉంటే ఎన్నో సమస్యలు పరిష్కరించవచ్చునన్నారు. ఆర్‌వీ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఏవీఎస్ మూర్తి, జాతీయ విద్యాసమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్, ప్రో-చాన్స్‌లర్ డీపీ నాగరాజ్, వైస్‌చాన్స్‌లర్ ద్వారకా ప్రసాది ఉనియాల్, రిజిస్ట్రార్ డాక్టర్ సహనాగౌడ పాల్గొన్నారు. డాక్టర్ ఏవీఎస్ మూర్తి మాట్లాడుతూ ఉన్నత విద్య పూర్తి చేసిన విద్యార్థులు సమాజంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారనే విశ్వాసం ఉందన్నారు.

చేళూరులో జనస్పందన సమావేశం



జనస్పందనలో ఎమ్మెల్యే, అధికారులు

చేళూరు/బాగేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంగా శనివారం జనస్పందన కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని కేపీఎస్ పాఠశాలలో సమావేశం జరిగింది. బాగేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, జిల్లా అధికారి రవీంద్ర, తహసీల్దార్, ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రజలనుంచి వివిధ సమస్యలపై 152 అర్జీలు వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి బోరుబావుల తవ్వకానికి తగిన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యార్థం చేళూరులో బస్టాండ్ ఏర్పాటు చేయాలన్న ప్రజల డిమాండ్‌ను పరిశీలిస్తామన్నారు. వర్షాకాలం కావడంతో మురుగు కాలువలలో పూడిక తొలగించి తగిన మరమ్మతులు చేపట్టాలని ప్రజలనుంచి వినతులు వచ్చాయన్నారు. కాగా చేళూరులో ప్రజాసౌధ నిర్మాణానికి ప్రజలనుంచి ఎక్కువగా వినతులు వచ్చాయని జిల్లా అధికారి రవీంద్ర అభిప్రాయపడ్డారు. ఇన్‌చార్జ జిల్లా అధికారి డాక్టర్ భాస్కర్, జడ్పీ సీఈఓ డాక్టర్ వై నవీన్‌భట్, ఉప విభాగాధికారి అశ్విన్, తాలూకా తహసీల్దార్ శ్వేత, తాలూకా పంచాయతీ ఈఓ జీవీ రమేశ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై బైక్‌ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే తదితరులు

బెంగళూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): రోటరీ బెంగళూరు బన్నేరుఘట్ట, మోటో ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. వేగా సిటీ మాల్‌వద్ద ప్రారంభమైన ర్యాలీ బన్నేరుఘట్ట పార్కువరకు 11కిలోమీటర్ల మేర సాగింది. ఎమ్మెల్యే సీకే రామమూర్తి, రోటరీ ఇంటర్నేషనల్ చైర్మన్ ట్రాన్సిస్కో అరజ్జో జిల్లా గవర్నర్ శ్రీధర్, బన్నేరుఘట్ట విభాగం అధ్యక్షులు డాక్టర్ కనవల్ కమ్రా పాల్గొన్నారు. రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిగ్నల్స్‌కు అనుగుణంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. రోటరీ ప్రతినిధులు రమా కులకర్ణి, అనిల్, సురేశ్ ప్రకాశ్, వందనా కులకర్ణి పాల్గొన్నారు. 400మంది బైక్‌ర్యాలీలో భాగస్వామ్యులయ్యారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం




విధానసౌధ వద్ద సైకిల్ ర్యాలీ

బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సైక్లింగ్‌తో ఆరోగ్యం సాధ్యమని బెంగళూరు నగర జిల్లా పంచాయతీ సీఈఓ యతీశ్ అభిప్రాయపడ్డారు. కంఠీరవ స్టేడియంలో నగర జిల్లా పంచాయతీ, యువజనులు క్రీడలశాఖ సంయుక్తంగా జాతీయ క్రీడాదినోత్సవాన్ని జరిపింది. ఇందులో భాగంగా ఆదివారం సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. వందలాదిమంది సైక్లిస్టులు పాల్గొన్నారు. యువజనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శశికళ మాట్లాడుతూ సైక్లింగ్‌తో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరనుందన్నారు. గో గ్రీన్ సంస్థ రావ్, వెంకటేశ్, జాన్ బాస్టిన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ నిమజ్జనం

బాగేపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గూళూరు గ్రామంలో రెడ్డి యువజనసంఘం ఆధ్వర్యంలో నాల్గో వార్షిక వినాయక చవితి వేడుకలలో భాగంగా ఆదివారం నిమజ్జనోత్సవం జరిగింది. వినాయకుడిని కొలువుదీర్చి ఐదు రోజులు పూర్తైన సందర్భంగా పలు సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మూర్తులను ఆదివారం నిమజ్జనం చేశారు. తొలుత విశేషపూజలు నిర్వహించి పురవీధులలో ఊరేగించారు. శోభాయాత్రలో భాగంగా రోడ్డు పొడవునా విద్యుద్దీపాలంకరణ చేయగా, బాణాసంచా కాల్చి సందడి చేశారు. యువత సంగీతానికి అనుగుణంగా నృత్యాలు చేసి సంబరంగా సాగారు. అనంతరం నల్లపరెడ్డిపల్లి చెరువులో గౌరి గణేశ విగ్రహాలను సంప్రదాయంగా నిమజ్జనం చేశారు. ఉత్సవంలో బాబురెడ్డి, రంగారెండ్డి, సాయినాథరెడ్డి, సుందరామిరెడ్డి, రఘురామిరెడ్డి, దామోదరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుడుమలె గణేశ పల్లకీ ఉత్సవం



పల్లకీపై కురుడుమలె వినాయకుడు

ముళబాగిలు(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుడుమలె గ్రామంలో పురాణ ప్రసిద్ధ లక్ష్మీగణపతి పల్లకీ ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పల్లకీలో స్వామివారి ఉత్సవమూర్తిని పురవీధులలో ఊరేగించారు. దారి పొడవునా నీరుచల్లి రంగవల్లులు వేసి స్వాగతించి టెంకాయలు కొట్టి స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల నడుమ పల్లకీ ఉత్సవం సాగింది. గ్రామపంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు, ఆలయ సమితి పదాధికారులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేళూరులో...

చేళూరు(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో ఆర్యవైశ్య కల్యాణమండపంలో కొలువుదీర్చిన వినాయకుడిని ఆదివారం ఘనంగా నిమజ్జన ఉత్సవం చేశారు. తొలుత స్వామివారికి విశేష పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఐదురోజులపాటు నిత్యపూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం పురవీధులలో స్వామివారిని ఊరేగించారు. భక్తులు గణపత్సిబప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ సాగారు. అనంతరం సమీపంలోని చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేశారు.



చేళూరులో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



గూళూరు గణేశ నిమజ్జనంలో పాల్గొన్న భక్తబృందం

తాడిపత్రిలో రాళ్ల యుద్ధం

- వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్తత
- జేసీ వర్సెస్ కాకర్ల
- లారీ, డీజే వాహన అద్దాలు ధ్వంసం



వాగ్వాదం చేసుకుంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్

తాడిపత్రి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీకే చెందిన కాకర్ల రంగనాథ్ వర్గీయులు రాళ్ల దాడి చేసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రధాన అనుచరుల్లో కాకర్ల రంగనాథ్ ఒకరు. మనస్పర్థలతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. కాకర్ల, జేసీ వర్గీయులు ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనానికి ఊరేగింపుగా బయల్దేరారు. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద రంగనాథ్ వాహనాన్ని ఆపి, డ్యాన్సులు వేస్తున్నారు. వెనకే జేసీ ప్రభాకర్ రెడ్డి విగ్రహ వాహనం ఉంది. దీంతో ఆయన త్వరగా వెళ్లాలని రంగనాథ్ వాహనం వారికి సూచించారు. దీంతో వాగ్వాదం తలెత్తింది. అక్కడున్నవారు సర్దిచెప్పి పంపించారు. అనంతరం రామచంద్ర లాడ్జి సమీపంలోకి రాగానే కాకర్ల రంగనాథ్‌కు సంబంధించిన వినాయక విగ్రహం వద్ద డీజేలు పెట్టి, పాటలు పాడుతూ, డ్యాన్స్‌లు వేస్తున్నారు. ప్రభాకర్‌రెడ్డి తొందరగా వెళ్లాలంటూ మరోసారి రంగనాథ్‌తో వాగ్వాదానికి దిగారు. వారి వర్గీయులు వెనుకవైపు నుంచి కేకలు వేయడంతో ఘర్షణ మొదలైంది. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. కట్టెలు తీసుకుని, రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. కాకర్ల రంగనాథ్‌కు సంబంధించి వినాయకుడి విగ్రహాన్ని తరలించే లారీ, డీజే బాక్సుల వాహన అద్దాలు పగులగొట్టారు. పోలీసులు వెంటనే వాహనాలను పక్కకు పెట్టించారు. ఇరువర్గాలకు సర్ది చెప్పి ఇళ్లకు పంపించారు. అంతటితో సద్దుమణిగింది. ఆ తరువాత వినాయకుడి విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ నిమజ్జనానికి తరలించారు.



ధ్వంసమైన డీజే వాహన అద్దాలు



రాళ్లు రువ్వుకున్న దృశ్యం

కూలి బతుకుల్లో కన్నీళ్లు..

- కూలీల ఆటోను ఢీకొన్న వ్యాన్
- ఇద్దరు మృతి
- డ్రైవర్ సహా 12 మందికి గాయాలు



మల్లెల లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ(ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పరాయి ఊరికి పని కోసం బయల్దేరిన కూలీల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం కన్నీళ్లు నింపింది. మలుపులో మృత్యువు వ్యాన్ రూపంలో దూసుకొచ్చింది. ప్రాణాలు తీసి, కుటుంబాల్లో చీకట్లు నింపింది. మండలంలోని మైలసముద్రం గ్రామ సమీపాన ఆదివారం ఉదయం కూలీల ఆటోను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. 12 మంది గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన 13 మంది మహిళా కూలీలు అదే ఊరికి చెందిన గోపాల్ ఆటోలో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లికి కూలి పనుల కోసం బయలుదేరారు. మైలసముద్రం గ్రామ సమీపంలోని మలుపు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఒలిపి లక్ష్మీనరసమ్మ(70) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన రాజేశ్వరి, లక్ష్మమ్మ, మల్లెల లక్ష్మీదేవి, చిన్నాగమ్మ, వెంకటనారాయణమ్మను 108 వాహనంలో కొత్తచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ముగ్గురు గంగమ్మ, రమాదేవి, ఆటో డ్రైవర్ గోపాల్‌ను పుట్టపర్తిలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. మల్లెల లక్ష్మీదేవి(50) కొత్తచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చిన్నాగమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మమ్మను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒలిపి లక్ష్మీనరసమ్మకు కుమారుడు ఓబిరెడ్డి అలియాస్ చంద్రాయుడు ఉన్నాడు. అతడు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మల్లెల లక్ష్మీదేవికి భర్త ఈశ్వరప్ప, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు, బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. ఒలిపి లక్ష్మీనరసమ్మ, మల్లెల లక్ష్మీదేవి మృతదేహాలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పూజలందుకుంటున్న గణేశుడు



స్థానిక ప్రముఖులకు సన్మానం

బొమ్మనహళ్ళి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, ఎబ్బలూరు ప్రాంతాలలో భారీ గణనాథుడిని కొలువుదీర్చారు. ఇక్కడ సుమారు 20 అడుగుల ఎత్తైన వినాయకుడిని శనివారం ప్రతిష్ఠించి పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు టీ వాసుదేవరెడ్డి, అనిల్‌రెడ్డి, కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఐదురోజులపాటు పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతుసంఘాల నాయకులు

శిడ్లఘట్ట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని స్థానిక నాయకుడు లోకేశ్‌గౌడ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్ళాపుర జంట జిల్లాల రైతులకోసం ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల, మార్కెట్ సౌలభ్యాలు, పంటలకు కనీస మద్దతుధర వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. మీడియా సమావేశంలో హసిరుసేన తాలూకా అధ్యక్షుడు నరసింహగౌడ, ఉపాధ్యక్షుడు రఘు, వీరపుర రామణ్ణ, బైరారెడ్డి, నరసింహప్ప, బైరప్ప, నందీశ్, బైరవేశ్, రైతుసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ



బోల్తాపడిన లారీ



ఢీకొన్న రెండు లారీలు

రాయచూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా గోలపల్లి గ్రామ శివార్లలోని జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో వాహనాలు ధ్వంసమైయ్యాయి. మూడు రోజుల కిత్రం బోల్తా పడిన లారీ అవశేషాలను రోడ్డు పక్కన నుండి తొలగించకపోవడంతో ఈ రోడ్డు ప్రమాదానికి కారణమైంది. ఈ సందర్భంగా ఎదురుగా వస్తున్న లారీకి దారి ఇవ్వడానికి ఒక బొలెరో వాహనం ఆగి ఉంది. బొలెరో వెనుక ఒక బైక్ ఆగి ఉంది, వెనుక నుండి వేగంగా వస్తున్న మరో లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బొలెరో మరియు బైక్ దెబ్బతిన్నాయి. పోలీసులు ఘటనా స్థళాన్ని సందర్శించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. అదృష్టవశాత్తు, ఎవరికీ గాయాలు కాలేదు. గోలపల్లి గ్రామం గుండా వెళుతున్న బీదర్-శ్రీరంగపట్నం జాతీయ రహదారి (150ఏ)లో ప్రతిరోజూ చిన్న, పెద్ద ప్రమాదాలు జుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నరసింహ(ఫైల్)

రాయచూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని గుట్టుబిచ్చాలి గ్రామంలో ఆదివారం గణేష్ విగ్రహం ఊరేగింపు సందర్భంగా విద్యుత్ తీగ తగిలి ఒక యువకుడు మృతి చెందాడు. మృతుడిని నరసింహ(22)గా గుర్తించారు. హనుమాపూర్ సమీపంలోని రాజోళ్ళిబండా వద్ద గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి బొలెరో వాహనంలో నరసింహ ప్రమాణిస్తుండగా, మార్గమధ్యలో ఉన్న విద్యుత్ తీగ తగిలి ఆయన మృతి చెందాడు. నరసింహకు విద్యుత్ తీగ తగలడాన్ని గమనించిన నరసింహ పక్కన ఉన్న కొందరు వాహనం నుంచి కిందపడి గాయపడ్డారు. అయితే నరసింహ మృతి చెందాడు. ఈ సంఘటన పై యరగేరా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

జ్వరంతో యువకుడు..

బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లికి చెందిన వరుణ్ (20) అనే యువకుడు ఆదివారం జర్వంతో మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వరణ్‌కు కొద్ది రోజులుగా జ్వరంతో రావడంతో స్థానికంగానే వైద్యం చేయించుకున్నాడు. దీనికి తోడు పచ్చ కామెర్లు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం వేకువజామున పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడే పడిపోయాడు. ఉదయం 10 గంటలైన ఇంటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు పొలంలోకి వెళ్లారు. అక్కడ పడిపోయి ఉన్న వరుణ్‌ను ఇంటికి తీసుకొచ్చి 108 వాహనంలో ఉరవకొండ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్వరంతో బాధపడుతున్న వరుణ్ ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.32	1,630.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	61.681	34,983
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	69,775	10,067
నీటి నిల్వ (టీఎంసీలు)	77.54	94.55

15 ఏళ్ల బాలికతో సర్పంచ్ వివాహం

● స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి జిల్లాలోనే ఘటన ● ఆలస్యంగా వెలుగులోకి..

బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ సొంత జిల్లా బెళగావి, పబ్లిక్‌వర్క్స్ శాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళి నియోజకవర్గం యమకనమరడి పరిధిలోని ఓ గ్రామ పంచాయతీ సర్పంచ్ 15ఏళ్ల బాలికను వివాహం చేసుకున్నాడు. 2023 నవంబరు 5న వివాహం జరిగింది. అప్పట్లోనే భార్య వయసు తప్పుగా నమోదు చేసేందుకు నకిలీ జనన ధ్రువీకరణపత్రాన్ని సిద్ధం చేసుకున్నాడు. అయితే బాలిక పాఠశాలలో సర్టిఫికెట్‌ను పరిశీలించగా మైనర్‌గా తేలింది. ఐదు నెలల క్రితం బాలిక ఓ బిడ్డకు జన్మనిచ్చింది. తాజాగా వారం క్రితం విషయం వెలుగులోకి రాగా యమనకమరడి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే సర్పంచ్ పరారీలో ఉండగా అతడిని గుర్తించేందుకు పోలీసులు గాలింపు జరుపుతున్నారు.

బోనులో పడ్డ చిరుత

కంప్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హడగలి తాలుకాలోని హగరనూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు ఉంచిన బోనులో చిరుత చిక్కింది. గత వారంలో చిరుత గొర్రెల మందపై దాడి చేసి గొర్రెలను హతమార్చింది. దీంతో రైతులు, కూలీలు, పొలాలకు వెళ్లడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించడానికి బోను ఏర్పాటు చేశారు. చిరుత పట్టుబడడంతో ప్రజలు. రైతులు. కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: వైద్యాధికారి



డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న డాక్టర్ అబ్దుల్

సిరుగుప్ప, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): నీటిని వేడి చేసుకుని తాగాలని జిల్లా ఆరోగ్య రోగ నివారణ వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ తెలిపారు. ఆదివారం సిరుగుప్ప తాలుకా పరిధిలో ఇబ్రహీంపురం గ్రామానికి సందర్శించారు. భారీ వర్షాల కారణంగా సీజనల్ జ్వరాలైన డెంగీ, చికన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలను అరికట్టడంపై ముందు జాగ్రత్త చర్యల కోసం అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటిని స్వచ్ఛంగా వుంచుకోవాలని ప్రజలకు తెలిపారు. తాగునీటిని వేడి చేసుకుని చల్లార్చుకుని తాగాలని తెలిపారు. వ్యాధులు సోకితే వెంటనే ఆస్పత్రికు వెళ్లి చికిత్స పొందాలని తెలిపారు.

జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ

రొళ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలం మల్లినమడుగు గ్రామానికి చెందిన రంగనాథ్ కుమార్తె హాసిని రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభ చా టింది. ఎన్సీఈఆర్టీ కమ్యూన్ ఇంటర్ గ్రాంటెడ్ బీఎస్సీ ఫిజిక్స్ ప్రవేశ పరీక్షలో 21వ ర్యాంక్ సాధించింది. రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మెయారు, హర్యాణాలో సీటు దక్కింది.

పూజలందుకుంటున్న గణనాథుడు



అంజనాద్రి గణేశుడు

బళ్లారి సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో పలు మండలపాల్లో ఆదివారం సందడి నెలకొంది. ఐదవ రోజు కావడంతో నిమజ్జనానికి సిద్ధమవుతున్న గణప్ప, నగరంలోని నంతపురం రోడ్డులోని నేకారుల కాలనీ 19వ సంవత్సరం వార్షిక ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంలో కాలనీ వాసుడు టీ.వెంకటేశ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసంవత్సరం కూడా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. ఆదివారం భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా విజయ్, శీనా, రంగస్వామి, రవి,వీరేశ్ తదితరుల భక్తుల ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ ప్రత్యేక పూజలు



అల్లం ప్రశాంత్‌ను సన్మానిస్తున్న బోయపాటి విష్ణువర్ధన్

బళ్లారిరూరల్ : నగరంలోని విద్యానగర్ ఆంజనేయ స్వామి ఆలయం వినాయక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్‌ను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్ధన్ ఆలయంలో ఆయనను ఘనంగా సన్మానించి ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకం నిర్వహించారు.

సంప్రదాయాలు మరువరాదు..

కంప్లి (ఆంధ్రజ్యోతి) : దేశంలో తరతరాలు వస్తున్నా సాంప్రదాయాలను మహిళలు మరువరాదని పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని 21వ వార్డులోని షుగర్ ఫ్యాక్టరీలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలో గణపతి పండుగ సందర్భంగా కేఎస్ఎఫ్ వినాయక మహా మండలి నిర్వహించిన ముగ్గుల పోటీలకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ ప్రతిభను సృజనాత్మకతను ప్రదర్శించడానికి ముగ్గుల పోటీలు దోహదపడుతుందన్నారు. పాత్రికేయులు సంఘం తాలుకా అధ్యక్షుడు వీరేష్ విజేతలైన మహిళలకు బహుమతులు అందించారు. ఇందులో కవిత (ప్రథమ), సునీత (ద్వితీయ), రేష్మ (తృతీయ) ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు చిన్న బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో బీడీసీసీ జిల్లా డైరెక్టర్ పి మూకయ్యస్వామి, మున్సిపల్ కౌన్సిలర్ హేమావతి, పూర్ణచంద్ర, కేఎస్ చాంద్ బాషా, పురసభ నామినేటెడ్ సభ్యులు డీ మౌనేషా, ప్రముఖులు శాంతిలాల్, మహిళలు పాల్గొన్నారు.



గెలుపొందిన మహిళలకు బహుమతులు ఇస్తున్న ప్రముఖులు

కోలాహలంగా నిమజ్జనం

రాయచూరు (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా నగరంలోని వివిధ మండపాల్లో ప్రతిష్ఠించిన వినాయకులను నిమజ్జనం చేసేందుకు తరలుతున్న ఊరేగింపులు కోలాహలంగా సాగాయి. ఐదవ రోజు పూజలు నిర్వహించి ఆదివారం సాయంత్రం నుంచి నిర్వాహకులు ఊరేగింపులను ప్రారంభించారు. దీంతో నగరంలోని రోడ్లన్నీ జనంతో కిక్కిరిసి పోయాయి. ప్రధాన రహదారుల ద్వార ఊరేగింపులు కొనసాగించిన నిర్వాహకులు తాము ప్రతిష్ఠించిన విగ్రహాలను స్థానిక ఖాసభావి వద్ద నిమజ్జనం చేవారు. ఈ భావి వద్ద మహానగర పాలిక యంత్రాంగం పూర్తిగా ఏర్పాట్లు చేయగా ఊరేగింపుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పూర్తి బందోబస్త్ ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

విద్యార్థులకు టీ షర్టుల పంపిణీ



విద్యార్థులకు టీ షర్టులు అందజేస్తున్న రాజశేఖర్, వెంకటరమణ బాబు

కంప్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): క్రీడా విద్యార్థులకు కౌన్సిలర్ వెంకటరమణ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం టీషర్టులను సమితి అధ్యక్షుడు రాజశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని ఘనంగా ఆచరిద్దాం

● డిప్యూటీ తహసీల్దార్



మాట్లాడుతున్న డీటీ

సిరుగుప్ప, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణంలో ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని ఆచరించడంపై పూర్వాపరాల సిద్దత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు, సమాజ ప్రముఖులతో జయంతిని ఆచరించడంపై సలహాలు, చర్చలు నిర్వహించారు. స్థానిక అమృతేశ్వరాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. విశ్వకర్మ సమాజం అధ్యక్షులు మౌనేష్ ఆచారి, ప్రముఖులు వీరేంద్ర ఆచారి, మల్లయ్య, తాలుకా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించగల సమస్యలు, వివిధ శాఖల గుణాత్మక అంశాలపై సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి సమీర్ శుక్లా అన్నారు. హొసపేట నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో శనివారం జిల్లాపంచాయతీ నిర్వహించిన వివిధ శాఖల ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గతంలో బళ్లారి జిల్లాలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నందున విజయనగరం జిల్లా గురించి తనకు పూర్తి సమాచారం ఉందన్నారు. ప్రగతి సమీక్ష సమావేశంలో గణాంకాలను చెప్పే బదులు, వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లోని సమస్యలను సమావేశంలో బహిరంగంగా చర్చించాలన్నారు. తాగునీటి సరఫరాలో జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని, హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేసుకోవడంతోపాటు పారిశుద్యం , స్వచ్ఛమైన తాగునీటి సరఫరాలను నిర్ధారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో యూనిఫాంల పంపిణీ ,హాస్టళ్లలో ప్రాథమిక సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నయీమ్ పాషా మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లాలో 53.843 హెక్టార్ల నీటిపారుదల భూమి ,2,24,218 హెక్టార్ల ఎండు భూమిలో విత్తనాలు నాటారు. మొత్తం 2,78,060 హెక్టార్లు మొత్తం 1,11,595 మెట్రిక్ టన్నుల వివిధ ఎరువుల డిమాండ్ ఉంది. 69,972 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయబడ్డాయి,17,042 మెట్రిక్ టన్నుల స్టాక్ అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎం.ఎస్.దివాకర్, జిల్లాపంచాయతీ సీఈఓ నోంగ్‌జోయ్ మహ్మద్ ఆలీ అక్రమ్ షా, అదనపు జిల్లాకలెక్టర్ బాలకృష్ణప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి సమీర్ శుక్లా



కాంట్రాక్టర్లకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని గడిగిచెన్నప్ప సర్కిల్ నుంచి ఈడిగ హాస్టల్ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు కాంట్రాక్టర్ల నుంచి సమాచారం పొంది, అవసరమైన సూచనలు ఇచ్చారు. నగరంలోని గాంధీభవనం ముందు ప్లాన్ చేసిన పూలు, పండ్ల వీధి వ్యాపారుల మార్కెట్ నిర్మాణ పనుల గురించి ఆరా తీసి, పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈసందర్భంగా కార్పోరేషన్ మాజీ మేయర్ ఎం.రాజేశ్వరీ, సభ్యులు ప్రభంజన్‌కుమార్, పి.గాదెప్ప, కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, నాగలకెర గోవింద, సోమప్ప, మడివలప్ప, ప్రజాపనుల శాఖ ఈఈ హేమరాజ్,ఏఈఈ బసారెడ్డి, కార్పోరేషన్ నూతన కమిషనర్ మంజునాథ్, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

దళితులకు సీఎం పదవి ఇవ్వాలి

● చలవాది మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న బసవరాజ్

బళ్లారి సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోసీఎం మార్పు గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇదే జరిగితే ముఖ్యమంత్రిస్థానం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న దళిత సామాజికవర్గానికి చెందినవారికి ఇవ్వాలని దళిత చలవాది మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజ్ డిమాండ్ చేశారు. నగరంలోని పత్రికా భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా కేపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జునఖర్గే, పరమేశ్వర్,మునియప్ప, మహాదేవప్ప, సతీశ్ జార్కిహొళి వంటి దళిత నాయకులకు సీఎం అయ్యే సామర్థ్యం ఉందన్నారు. వారిలో ఎవరికైనా ఇవ్వండి రాష్ట్రంలో దళితులు సీఎంలు కావాలి. ఇది ఇవ్వకపోతే దళితులు ప్రత్యామ్నాయాన్ని చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈసందర్భంగా డాక్టర్ సోమనాథ్,శ్రీనివాస్, ఓంకారప్ప, నిరంజనమూర్తి,మనల్లి సిద్దబసప్ప,ఆనంద కుమార్, శ్రీనివాస్,గూళ్యప్ప, బసవరాజ్,సి.శంకర్, నరసప్ప, గాదిలింగప్ప తదితరులున్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న రెయిన్‌బో కరస్పాండెంట్ చాంద్‌బాషా

కంప్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో శ్యామ్ చంద్ పాఠశాల ఆవరణంలో హైస్కూలు విద్యార్థులు జరిగిన క్రీడల్లో వాలీబాల్ పోటీల్లో రెయిన్‌బో విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు చాంద్‌బాషా విద్యార్థినిలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ రెయిన్‌బో సంస్థ ద్వారా చదువుతో పాటు విద్యార్థులకు క్రీడల్లో ఎక్కువగా ఆసక్తి పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు క్రీడల పోటీల్లో గెలుపొందడంతో పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో సంస్థ అధ్యక్షుడు షారుక్ డైరెక్టర్ అజీజ్, ప్రిన్సిపాల్ మేఘన డ్రిల్ టీచర్ జడెప్ప, శివకుమార్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఒత్తిళ్లు దూరం: ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతినిత్యం క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఆదివారం హొస్పేట్ బైపాస్ రోడ్డు మినీ విధాన సభ వద్ద ఏర్పాటు చేసిన కట్టే దుర్గప్ప ట్రోఫీ క్రికెట్ పోటీలను ప్రారంభించి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ యువతీ యువకులు మొబైల్ సినిమా, కంప్యూటర్, ల్యాప్‌టాప్ మోజులో పడి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బట్ట ప్రసాద్, ఉస్మాన్ చాంద్ బాషా, సీఆర్ హనుమంతు, నారాయణప్ప, సిద్దప్ప, మనోహర్, బళే మల్లికార్జున, అయోధ్య వెంకటేష్, కట్టే దుర్గప్ప, శంకర్, సునీల్, విజయ్, మహంతేష్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంజీ కనక

బళ్లారి సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని యల్పి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జోనల్‌స్థాయిలో బాలుర కబడ్డీ టోర్నమెంట్‌ను గెలుచుకుని తాలూకా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర అభిమాని, సోషల్ మీడియా మేనేజర్ ఎంజీ కనక విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, జోనల్ స్థాయిలో గెలిచిన తర్వాత తాలూకా స్థాయిలోనే కాకుండా జిల్లాస్థాయిలో కూడా గెలిచి గ్రామానికి పేరు తేవాలన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నాగరాజ్, ఎస్డీఎంసీ అధ్యక్షుడు తిప్పేస్వామి, సభ్యులు బాబు, అంబరీశ్,గోవింద, ఓబలేశ్, రుద్రన్న, నాగరాజ్,యాల్పి గ్రామ నాయకులు శర్మాస్, కృష్ణ, మల్లి, నవీన్,శాక్షవలి,హేమరాజ్,ఎర్రిస్వామి,నాగరాజ్,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

చర్చి రజతోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న బిషప్

హోసూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ మత్తిగిరి హోలి మదర్ ఆఫ్ హెల్త్‌చర్చ్ రజతోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ధర్మపురి డయాసెస్ బిషప్ డాక్టర్ లారెన్స్ ముఖ్యులుగా పాల్గొన్నారు. 2001లో రెవరెండ్ చర్చ్‌ను నిర్మించారు. ప్రస్తుతం 25 సంవత్సరాలు పూర్తి కావడంతో రజతోత్సవాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 8న ప్రధాన ఉత్సవం జరగనుంది. ఆదివారం ఉదయం చర్చ్‌లో జెండాను ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. హోసూరు చర్చ్ డయాసెస్ ప్రధాన ఫాదర్ క్రిస్టోఫర్, తదితరులు పాల్గొన్నారు. చర్చ్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సెప్టెంబరు 8న సామూహిక ప్రార్థనలు, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నారు.

రిటైర్డ్ ఆర్టీఓకు ఘన సత్కారం

బళ్లారిరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఆర్టీవో కార్యాలయంలో రిటైర్డ్ అయిన ఆర్టీవో హేమంత్‌కుమార్ దంపతులకు సీనియర్ ఏ ఆర్టీవో శ్రీనివాస్ గిరి, రఫీక్, నిజాముద్దీన్, శరణ్య బసవరాజు, పలువురు అధికారులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపిరు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలపై కొన్ని విషయాలు మాట్లాడారు. 33 సంవత్సరాల 8 నెలల పాటు ఆర్టీవో కార్యాలయంలో సీనియర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి 30వ తేదీ పెట్టడైనంత ఆఫీసు సిబ్బంది, సీనియర్ ఆఫీసర్లు ఆయనను ఘనంగా సన్మానించారు.



హేమంత్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఏఆర్టీవో శ్రీనివాస్ గిరి తదితరులు



ఊరేగింపులో భారీ వినాయకుడి విగ్రహం



చెరువులో నిమజ్జనం

ఘనంగా గణేశ్ నిమజ్జనం

హోసూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో గణేశ నిమజ్జన ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వినాయక చవితి సందర్భంగా కొలువుదీర్చిన గణనాథులను ఐదోరోజు ఆదివారం పురవీధులలో ఊరేగించి చెరువులో సంప్రదాయంగా నిమజ్జనం చేశారు. వీజేపీ, శివసేన, శ్రీరామసేన, హిందూ మున్నాని తదితర సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరు ప్రాంతాలలో భిన్నరూపాలలో వినాయకుడిని కొలువుదీర్చారు. ఐదురోజులపాటు విశేషపూజల అనంతరం పురవీధులలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. 84కుపైగా భారీ విగ్రహాలతోపాటు సుమారు 800 విగ్రహాలను రామనాయకన్ చెరువు, చంద్రంబికై చెరువులలో నిమజ్జనం చేశారు. ఊరేగింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 1500మందికిపైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ప్రత్యేకించి మసీదులు, చర్చ్ ల వద్ద ఎలాంటి గొడవలకు అవకాశం లేకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షించారు. ఇం దుకుగాను ధర్మపురి, కృష్ణగిరి, సేలం, నామక్కల్ తదిత ర ప్రాంతాలనుంచి పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించారు.



మసీదు వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు







ఊరేగింపులో వినాయకుడి విగ్రహం, పార్వతీదేవి ఉగ్రరూపం, వివిధ పుష్పాల అలంకరణలో గణనాథుడు